సాక్షి గుంటూరు

గురువారం । 30 । జనవరి । 2025



రేపటి నుంచి వార్షికోత్సవాలు

నాదెండ్ల: సాతులూరు గ్రామదేవతల ఆలయ పదో వార్షికోత్సవాలు ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి ఐదు వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



2న కోటి నామోత్సవం

మాచర్ల: పట్టణంలోఫిబ్రవరి 2న శ్రీ భగవాన్ గీతా యజ్ఞం - కోటి నామోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పరబ్రహ్మ కాశీ విశ్వనాథ స్వామి సత్సంగ సభ్యులు బుధవారం ప్రచారం చేశారు.



శ్రీవారి కల్యాణ మహోత్సవం

తెనాలిరూరల్: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవారి శ్రవణా నక్షత్రం సందర్భంగా నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ 'అనుబంధ' అధ్యక్షుల నియామకం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పార్టీకి సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ మహిళా విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షురాలిగా తెనాలి నియోజకవర్గానికి చెందిన బూరెల నాంచారమ్మ, లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన చేబ్రోలు ధన్వంతరి భగవాన్ (సీడీ భగవాన్), రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన నల్లమోతు రామకృష్ణలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉత్తరాషాఢ నక్షత్రము, అమావాస్యను పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు భూ వరాహ స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించామని, 10 గంటలకు సర్వ గ్రహ దోష నివారణ, ఆయురారోగ్యం కోసం సర్వరక్షాకర (సుదర్శన హోమం) నిర్వహించామని భక్తులు అధిక సంఖ్యలో ఈ హోమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

యార్డుకు 1,05,694 మిర్చి బస్తాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,05,694 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,01,695 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,693 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,816 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 106 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 163 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 243 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 176 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 51 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 514 క్యూసెక్కులు విడుదల చేశారు.

అమ్మ సన్నిధిలో అరాచకం

- వాసవీమాత గుడిలో టీడీపీ నేతల దౌర్జన్యకాండ
- ఆలయ కమిటీని పక్కనబెట్టి పెత్తనం
- యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘన
- ఆత్మార్పణ దినం పేరిట వసూళ్ల పర్వం
- పట్టించుకోని దేవదాయశాఖ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మ సన్నిధిలో టీడీపీ నేతలు అరాచకానికి తెగబడుతున్నారు. ఆలయ కమిటీపై దౌర్జన్యం చేస్తున్నారు. యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తూ కమిటీని పక్కనబెట్టి పెత్తనం సాగిస్తున్నారు. అయినా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గుంటూరు నగరంలోని ఆర్ అగ్రహారం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి వందేళ్ల పైబడి చరిత్ర ఉంది. పూర్వం నుంచి దేవస్థానం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏటా ఆలయంలో అమ్మ ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాదీ ఈనెల 31న దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో తెలుగుదేశం నేతలు తలదూర్చి పెత్తనం సాగిస్తున్నారు. ఆలయ పాలక మండలితో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆలయ అధికారులకూ విలువ ఇవ్వడం లేదు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట నిత్యం జరిగే అన్నదానానికీ అడ్డుతగిలారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం చేయాలని తలంచడంతో టీడీపీ నేతలు జోక్యం చేసుకున్నారు. అన్నదానం జరగడానికి వీలు లేదని ఆపేశారు. అప్పటి నుంచి అన్నదానం జరగనీయడం లేదు. గతంలో రోజూ ఇక్కడ 300 నుంచి 400 మంది ఆకలి తీర్చుకునేవారు. పాపమని తెలిసి కూడా టీడీపీ నేతలు పేదల ఉసురుపోసుకున్నారు.

అధికార లాంఛనమా..! అధికార పార్టీ లాంఛనమా..?

ఆలయంలో ఆత్మార్పణ దినోత్సం పేరు చెప్పి టీడీపీ నేతలు పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా వాట్సాప్‌ల్లో పూజల కోసం రూ.5,500 చెల్లించాలంటూ భక్తులకు మెసేజ్‌లు పెడుతున్నారు. భారీగా వసూళ్లకు తెగబడుతున్నారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం

దీంతోపాటు ఆ రోజు అన్నదానం, ప్రసాదాల పంపిణీ, డెకరేషన్‌లు, ఇతరత్రా కార్యక్రమాల పేరిట కూడా అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ నేతల తీరుతో ఆర్యవైశ్య ప్రముఖులు విసిగిపోయారు. తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. వెంటనే టీడీపీ నేతల ఆగడాలకు ప్రజాప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికార లాంఛనాలతో నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టీడీపీ నేతల తీరు అధికారపార్టీ లాంఛనంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు.



పోస్టర్‌పై ముందు ముద్రించిన టీడీపీ నేతల పేర్లు



దబ్బు వసూలు కోసం పెట్టిన వాట్సాప్ మెసేజ్

నా దృష్టికి రాలేదు

అనధికారికంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనేది నా దృష్టికి రాలేదు. దీనిపై ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటాం. అక్రమ వసూళ్ల విషయంలో మాకు ఎటువంటి సంబంధం లేదు.

– జి.మాధవి, ఏసీ, దేవదాయశాఖ

సంబంధం లేని వ్యక్తుల పేర్లతో కరపత్రాలు

ఆలయంలో పెత్తనం సాగిస్తున్న టీడీపీ నేతలకు ఎటువంటి అధికారం లేదు. గుడికి, వారికి అసలు సంబంధం లేదు. అయినా దేవదాయ శాఖ అధికారులు మౌనం దాలుస్తున్నారు. ఇదంతా స్థానిక ఎమ్మెల్యేకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ నెల 31వ తేదీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించి ముద్రించిన కరపత్రాల్లోనూ ముందుగా టీడీపీ నేతల పేర్లు వేయించుకున్నారు. ఆ తర్వాత ధర్మకర్తల మండలి, ఆలయ అధికారి పేర్లు ముద్రించారు. దీనిపై ఆర్యవైశ్య ప్రముఖులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. గుడికి ఏ సంబంధం లేని వ్యక్తులు ఎలా పెత్తనం చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- వచ్చేనెల 3న నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి
- కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలు
- రెండు జిల్లాల్లో 3.46 లక్షల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు



గుంటూరు ఎడ్యుకేషన్: శాసన మండలి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగనున్నాయి. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 29న పదవీ కాలం ముగియనుండటంతో ఆయా స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయించిన ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలతోపాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేఎస్ లక్ష్మణరావు పదవీ కాలం మార్చి 29న ముగియనుండగా, మార్చి 8వ తేదీ నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

ఎన్నికల ప్రక్రియ ఇలా

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్న కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుంది. 11న నామినేషన్ల స్క్రూటినీ అనంతరం, ఉపసంహరణకు 13 వరకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి చేస్తారు. మార్చి 8వ తేదీ నాటికి మొత్తం ప్రక్రియ ముగుస్తుంది. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి రెండు జిల్లాల పరిధిలో 3.46 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న కేఎస్ లక్ష్మణరావు మరోసారి పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తోపాటు మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు.

ఏఎన్‌యూ దూరవిద్య డిగ్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (దూర విద్యా కేంద్రం) గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు కార్యాలయంలో ఫలితాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫలితాల్లో బీఏ, బీకాం (జనరల్), (కంప్యూటర్ అప్లికేషన్స్) ఒకటి, రెండు, మూడో సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు వెల్లడించారు. దూరవిద్య కేంద్రం పరీక్షల డెప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైనులాబ్దిన్ మాట్లాడుతూ అభ్యర్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఫిబ్రవరి 11లోగా ఒక్కో పేపర్‌కు రూ.770 చెల్లించి ఫిబ్రవరి 14లోగా దూర విద్య కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు అందేలా పంపాలని సూచించారు. ఫలితాలు విడుదల కార్యక్రమంలో దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

జీవితానికి భరోసానిచ్చే ట్రాఫిక్ సిగ్నల్



కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ జీవితానికి భరోసానిచ్చే గ్రీన్ సిగ్నల్ అని, హెల్మెట్ ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే కిరీటమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభివర్ణించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్టు పెట్టుకోవడం వల్ల 90 శాతం రక్షణ ఉంటుందని వివరించారు.

ఫిబ్రవరి 15 వరకు మాసోత్సవాలు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు సర్కారు జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. యువత లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్నారని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. జిల్లాలో గత ఏడాది 607 రోడ్డు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం యువత, విద్యార్థులతో రహదారి భద్రత నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డీఆర్వో ఖాజావలి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, గుంటూరు ఆర్డీఓ సత్యనారాయణ ప్రసాద్, తెనాలి ఆర్డీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'గీత'తో గోవిందా

- గీత కార్మికుల మద్యం షాపులు దక్కించుకునేందుకు 'పచ్చ' బినామీల కుయుక్తులు
- జిల్లాలోని గీత కులాలకు 13 మద్యం షాపులు
- గౌడకు 9, గౌడ్‌కు 4 దుకాణాలు కేటాయిస్తూ గెజిట్ నోటిఫికేషన్
- వాస్తవానికి ఇవి రెండూ ఒకే కులం..
- అవగాహన రాహిత్యంతో రెండుగా చూపిన అధికారులు
- నగానికి తగ్గనున్న లైసెన్స్ ఫీజు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు పచ్చబినామీలు కుయుక్తులు పన్నుతున్నారు. గీత కార్మికులతో దరఖాస్తు చేయించి లైసెన్స్ ఫీజు చెల్లించి తాము నిర్వహించుకునేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధుల వద్ద వాలిపోయారు. పైరవీలు నెరుపుతున్నారు. కూటమి నేతలే దుకాణాలన్నీ దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు. జిల్లాలో గీత కార్మిక కులాలకు 13 మద్యం దుకాణాలు కేటాయిస్తూ ఈనెల 27న సర్కారు గెజిట్ విడుదల చేసింది. గౌడ కులానికి 9 షాపులు, గౌడ్ కులానికి 4 షాపులు కేటాయించారు. వాస్తవానికి ఇవి రెండు కులాలు కాదు. ఒకటే కులం. అవగాహన రాహిత్యంతో అధికారులు రెండుగా చూపారు. ఈ షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు.

లైసెన్స్ ఫీజుపై కోర్టుకు!

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. గత ఏడాది అక్టోబర్ 16 నుంచి షాపుల నిర్వహణకు అనుమతిచ్చింది. 10వేలలోపు జనాభా ఉంటే రూ.50లక్షలు, 50వేల జనాభాలోపు ఉంటే రూ.55లక్షలు, 5లక్షల జనాభాలోపు రూ.65లక్షలు, 5 లక్షల జనాభా దాటితే రూ.85 లక్షలు లైసెన్స్ ఫీజుగా వసూలు చేసింది. ఇప్పుడు గీత కార్మికులకు సగం మాత్రమే లైసెన్స్ ఫీజుగా నిర్ధారించడంపై గతంలో మద్యం షాపులు పొందిన లైసెన్సీలు గుర్రుగా ఉన్నారు. ఇది సరికాదని పేర్కొంటున్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. వాస్తవానికి మద్యం షాపుల గడువును 2024 అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్ నెలాఖరు వరకు సర్కారు విధించింది. ఇప్పుడు గీత కార్మికులకు ఫిబ్రవరిలో షాపులు హ్యాండోవర్ చేసినా ఐదు నెలల గడువు పూర్తయిపోవడంతో లైసెన్స్ ఫీజు మరికొంత తగ్గించేందుకు సర్కారు సిద్ధమైంది. దీనిని బట్టి చూస్తే గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని షాపునకు లైసెన్సీ రూ.42.50లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.



ఎక్సైజ్ శాఖ కార్యాలయం

కేటాయించిన ప్రాంతాలు	లైసెన్స్ ఫీజు(రూ.లలో)
గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ 1(గౌడ)	46,75,000
కాకుమాను 1(గౌడ)	30,25,000
కొల్లిపర 1(గౌడ్)	35,75,000
మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ 1(గౌడ)	35,75,000
మేడికొండూరు 1(గౌడ)	35,75,000
పెదకాకాని 1 (గౌడ)	35,75,000
పెదనందిపాడు 1(గౌడ్)	30,25,000
ఫిరంగిపురం 1(గౌడ)	35,75,000
పొన్నూరు 1(గౌడ)	35,75,000
ప్రత్తిపాడు 1(గౌడ)	30,25,000
తెనాలి 1(గౌడ్)	35,75,000
తుళ్లూరు 1(గౌడ్)	35,75,000
వట్టిచెరుకూరు 1(గౌడ)	30,25,000

పోలీస్ శాఖకు నైపుణ్యాభివృద్ధి అవసరం

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెరుగుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పోలీసు శాఖలోనూ నైపుణ్యాభివృద్ధి అవసరమని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చెప్పారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని ఉమేష్‌చంద్ర భవనంలో కొత్తగా ఏర్పాటుచేసిన 'మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ - హెచ్ఆర్‌డీ సెంటర్)ను బుధవారం గుంటూరు రేంజ్ ఐజీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో నైపుణ్యాన్ని పెంచేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంపై మెలకువలు, ఇంగ్లిష్ భాషపై పట్టు పెంచుకోవచ్చని వివరించారు. పోలీస్‌స్టేషన్లల్లో పని సామర్థ్యాన్ని పెంచేందుకు ఎస్పీ సతీష్‌కుమార్ చేసిన ప్రణాళిక ప్రశంసనీయమని కొనియాడారు. ఈ వినూత్నమైన ఆలోచన మంచి ఫలితాలను ఇస్తుందని వెల్లడించారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

పోలీసు సిబ్బందికి శిక్షణ తరగతులు

ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా జిల్లా పోలీస్ విభాగంలోని సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానం, ఇంగ్లిష్ భాషపై శిక్షణ తగతులు ఉంటాయని వివరించారు. అందరూ నైపుణ్యం సాధించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ప్రస్తుతం 30 కంప్యూటర్లతో శిక్షణ ప్రారంభించినట్లు వెల్లడించారు. కేసు చార్జ్‌షీట్ తయారుకు అవసరమైన కంప్యూటర్ టైపింగ్, ఇంగ్లిషు పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. చట్టాలపైనా అవగాహన కల్పిస్తామని, కోర్టు మానిటరింగ్ సిస్టమ్స్ ద్వారా కోర్టుల్లో కేసుల విచారణకు సంబంధించిన మెలకువలను నేర్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపట్ల, పల్నాడు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలు తుషార్ డూడీ, కంచి శ్రీనివాసరావు, కృష్ణకాంత్, దామోదర్, పలు జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

- ఫిబ్రవరి ఐదు నుంచి ఒకేషనల్ కోర్సులకు..
- 10 నుంచి సైన్స్ కోర్సులకు..

గుంటూరు ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, 10 నుంచి సైన్స్ కోర్సుల విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) జరగనున్నాయి. ఈమేరకు ఇంటర్మీడియెట్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 26,308 మంది సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సుల వారీగా 2,082 మంది విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన పరికరాలు, రసాయనాలతోపాటు విద్యార్థులకు అవసరమైన వసతులు ఉన్నవీ, లేనివీ పరిశీలించిన ఇంటర్ బోర్డు అధికారులు పూర్తిస్థాయిలో వసతులు ఉన్న కళాశాలల్లోనే ప్రాక్టికల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 119 కళాశాలల్లో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కాగా, మిగిలిన వాటిలో ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరగనుండగా, హాల్ టికెట్లు మరో మూడు రోజుల్లో రానున్నట్లు ఆర్ఐఓ జీకే జుబేర్ తెలిపారు. కాగా నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,800** గరిష్ఠం : రూ. **3,500**

మోడల్ ధర రూ. **3,100**

క్లుప్తంగా

షోకాజ్ నోటీసులు వెనక్కి

ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు డీఈఓ నిర్ణయం

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్) ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం వెనక్కి తీసుకున్నారు. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో ఏడుగురు ఉపాధ్యాయులు సెలవులో ఉన్న కారణంగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల్లో 50 శాతానికి మించకుండా సెలవు తీసుకోవచ్చునని స్పష్టంగా ఉండటంతో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ రేణుకను బుధవారం డీఈవో కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎంతోపాటు ఏడుగురు ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు నోటీసులకు ఎటువంటి సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

చిలకలూరిపేట: అభం శుభం ఎరుగని ఆరేళ్ల చిన్నారిపై యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గణతంత్ర దినోత్సవం నాడు ఈ దారుణం చోటుచేసుకుంది. రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు తెలిపిన వివరాల మేరకు... చిలకలూరిపేట మండలంలోని ఓ గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లిన క్రమంలో ఇతర బాలలతో కలిసి ఆడుకుంటోంది. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువకుడు పాలపర్తి గోవింద్ బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఎంతకూ బాలిక అతని ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో తోటి పిల్లలు ఆ ఇంట్లోకి తొంగి చూడగా బాలికపై లైంగిక దాడికి ప్రయత్నిస్తూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారికి పిల్లలు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడ్డుకున్నారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మానవాళి రక్షకుడు క్రీస్తు

- బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యేలు కిరణ్
- ముగిసిన మహోత్సవాలు



బైబిల్‌మిషన్ మహోత్సవాలు ముగియడంతో స్వస్థలాలకు బయలు దేరిన భక్తులు

పెదకాకాని: మానవాళి రక్షకుడు క్రీస్తు అని బైబిల్ మిషన్ అధ్యక్షులు రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ చెప్పారు.పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట జరిగిన బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. దైవజనులు ఫాదర్ ఎం.దేవదాస్ అయ్య చూపిన సువార్త మార్గంలో పయనిద్దామని, క్రైస్తవ రాజ్య స్థాపనకు నడుంబిగిద్దామని వివరించారు. వచ్చే ఏడాది బైబిల్ మిషన్ మహోత్సవం జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జరుగుతుందని వెల్లడించారు. మహోత్సవాల నిర్వహణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బైబిల్ మిషన్ మహోత్సవాల నివేదికను అందజేశారు. ముందుగా పశ్చిమగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక గీతాలను ఆలపించింది. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ ఎం.రవి, రెవరెండ్ డి.ఉజ్జీవం, రెవరెండ్ ఎ.తిమోతి రాజు, పాస్టర్ ఆర్.షాలేము రాజు దైవ సందేశాలు అందించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్ దేవదాసు మహోత్సవాల ఆఖరి ప్రార్థన చేశారు. మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్ ఆశీర్వాదంతో విజయోత్సవ శబ్దంతో మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో బైబిల్ మిషన్ అధికారులు సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

3న షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పెదవడ్లపూడిలోని సత్యషిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరు నాగభూషణం తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ఉదయం 5 గంటలకు కాగడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సుమారు 70 వేల మందికి అన్నదానం నిర్వహించనున్నామని వివరించారు. ఈ వార్షికోత్సవంలో జబర్దస్త్ కామెడీ షో కళాకారుల ఆధ్వర్యంలో హాస్యవల్లరి, సినిమా సంగీత గాయకులతో సంగీత విభావరి, డూప్ స్టార్ మ్యూజిక్ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని, భక్తులు సాయినాథుని దర్శించి బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

వెంకటపాలెంలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

వెంకటపాలెం(తాడికొండ): 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు వలపన్ని పట్టుకున్న ఘటన తుళ్ళూరు మండలం వెంకటపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటపాలెం గ్రామ పరిధిలో రేషన్ బియ్యం నిల్వచేసి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వెంకటపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డుకు వెళ్ళే అనుసంధాన రహదారిపై ఉంచిన 29 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడులలో బియ్యం బస్తాలు మాత్రమే దొరకడం, అందుకు సంబంధించిన నిందితులెవరూ అక్కడ పట్టుబడకపోవడం విశేషం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ 15 రోజుల తర్వాత మృతి చెందడంపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాలు ఇలా ఉన్నాయి. మార్టూరులో నివాసం ఉంటున్న చిగురుపాటి శివశంకర్ తండ్రి శివయ్య (68) ఈనెల 12న స్థానిక మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి జాతీయ రహదారికి పడమర వైపు గల సర్వీసు రోడ్డులో మోపెడ్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో టీవీఎస్ షోరూం సమీపంలో వాహనానికి హఠాత్తుగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడే పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెన్షనర్లకు మెడికల్ బిల్లులు చెల్లించాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పెన్షన్‌దారులకు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. పెన్షనర్ల భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆరోగ్య సమస్యలతో పెన్షనర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించి నిధులు విడుదల చేయాలని కోరారు. హెల్త్‌కార్డ్‌ల్లోని తప్పులను సరిచేసుకోవాలని, సకాలంలో ఐటీ రిటర్న్ అందచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు లంకా రంగనాయకులు, ప్రధాన కార్యదర్శి సి.సి. ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాదు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు వివరాలు సరిచేసుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ వివరాలలో ఏవైనా తప్పులు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా సవరించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులు ఇప్పటికే తమ వివరాలను టీచర్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్ (ఆన్‌లైన్)లో నమోదు చేసారని గుర్తుచేశారు. వాటిలో తప్పులు సవరించుకునేందుకు 31వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చినట్టు వివరించారు. ఉపాధ్యాయులు సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో తమ వ్యక్తిగత లాగిన్‌లో సరిచేసుకోవాలని సూచించారు. సవరణలకు ఇదే చివరి అవకాశంగా గుర్తించాలని, తదుపరి తప్పులకు ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ నియామకం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గుంటూరు జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పలువురిని నియమిస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నందేటి రాజేష్, షేక్ రహీమా, పచ్చల రత్నకుమారి, మన్నవ వీరనారాయణ, నల్లమోతు రూత్‌రాణి, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, దేవరశెట్టి సత్యనారాయణ (చిన్ని), ప్రధాన కార్యదర్శులుగా మామిడి రామారావు (రాము), చదలవాడ వేణుబాబు, ఈదులమూడి డేవిడ్‌రాజు, ప్రధాన కార్యదర్శి (లీగల్) మొండితోక శ్రీనివాసరావు, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా జొన్నల శివారెడ్డి, బొలిముంత పోతురాజు, ధర్మాల కుబేరస్వామి, ఎస్.గంగాధరరావు, షేక్ మస్తాన్ షరీఫ్ (ఎస్ఎంఎస్), అరుబండ్ల వెంకటకొండారెడ్డి, ఆకుల వెంకటేశ్వరరావు, బత్తుల గోవిందరాజు, కొప్పుల శేషగిరిరావు, షేక్ బాజీ, బాపతు వెంకటేశ్వరరెడ్డి, దర్శి నాగరాజు, పి.బాలవెంకటరెడ్డి (బాలారెడ్డి), ఓర్సు శ్రీనివాసరావు, యాక్టివిటీకార్యదర్శులుగా దేవరపల్లి నాగభూషణరావు, తాడిబోయిన యలమందారావు, మల్లారపు సుధారాణి, మొహమ్మద్ బాజీషహీద్, జూపల్లి హనుమంతరావు, లింగాల వెంకటరమణ, ఉయ్యూరు సతీష్‌రెడ్డి, వెలగాల కృష్ణ, మిరియాల శివరామకృష్ణ, షేక్ మహబూబ్ సుభాని, పెళ్లి నాగేశ్వరరావు, సి.హెచ్.లక్ష్మణ్, షేక్ రజియాబేగం, అధికార ప్రతినిధులుగా కొడాలి క్రాంతికుమార్, కాశినేడి బాజి, ఎండేటి వెంకటసుబ్బయ్య, బత్తుల కిషోర్, నాదెండ్ల రామచంద్రయ్యలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రేపటి నుంచి ప్రజాసాహిత్య, కళా, సాంస్కృతిక సభలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కొత్తపల్లి రవిబాబు తదితరులు

నగరంపాలెం: అఖిల భారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక (ఏఐపీఎల్‌సీఎఫ్) సభలను ఈనెల 31, ఫిబ్రవరి 1,2 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు తెలిపారు. బ్రాడీపేట రెండో వీధిలోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం సభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రవిబాబు మాట్లాడుతూ ఈనెల 31న, ఫిబ్రవరి 1న ఎన్‌జీవో కల్యాణ మండపంలో, ఫిబ్రవరి 2న రెవెన్యూ కల్యాణ మండపంలో సభలు జరుగుతాయని తెలిపారు. తొలి రోజు సాహిత్య సభ, మిగతా రెండు రోజులు తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బిహార్, ఒడిస్సా, ఢిల్లీ, ఝార్ఖండ్, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. చిత్రకళా ప్రదర్శనతోపాటు ఆయా రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యక్షులు దివికుమార్ మాట్లాడుతూ ఏఐపీఎల్‌సీఎఫ్ అనుబంధ సంస్థ అయిన జనసాహితీ సాంస్కృతిక కళా రంగాల్లో నిబద్ధతతో పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి రమణప్రసాద్, జనసాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.అరుణ, టి.శ్రీదేవి పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు ముగిసిన మార్కింగ్ ప్రక్రియ

- ఐదు గ్రామాల్లో 17 కిలోమీటర్ల మేర మార్కింగ్
- భూములు కోల్పోతున్న రైతుల వివరాల నమోదు



కేసానుపల్లి సమీపంలో మార్కింగ్ నిర్వహిస్తున్న సర్వే సిబ్బంది

నరసరావుపేట రూరల్: బైపాస్ రోడ్డు ఏర్పాటుకు మార్కింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. మంగళవారం రావిపాడు నుంచి మార్కింగ్ ప్రారంభించి, సాయంత్రానికి జొన్నలగడ్డ వరకు పూర్తి చేశారు. రావిపాడులో ఒక కిలోమీటరు, గుంటగార్లపాడులో కొంత మేర శాటిలైట్ సిగ్నల్ అందక ప్రక్రియ నిలిచిపోయింది. బుధవారం మూడు బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. జొన్నలగడ్డ నుంచి కేసానుపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర మార్కింగ్ చేశారు. అలాగే మంగళవారం శాటిలైట్ సిగ్నల్ కారణంగా నిలిచిపోయిన రావిపాడులో కొంతభాగం, గుంటగార్లపాడులో కూడా మార్కింగ్‌ను పూర్తి చేశారు. దీంతో కేసానుపల్లి, జొన్నలగడ్డ, నరసరావుపేట, ఇస్సప్పాలెం, గుంటగార్లపాడు, రావిపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని 17 కిలోమీటర్ల మార్కింగ్ పూర్తి చేసినట్టయింది. గతంలో హైవే అథారిటీ చేసిన సర్వేలో రహదారి నిర్మాణానికి 60 మీటర్ల మేర భూమిని సేకరించాలని నిర్ణయించి మార్కింగ్ ఇచ్చారు. తాజాగా చేస్తున్న సర్వేలో 45 మీటర్లకు కుదించి మార్కింగ్ చేస్తున్నట్టు సమాచారం. విలువైన భూములను ఇచ్చేందుకు రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. మార్కింగ్ చేస్తున్న సమయంలో హద్దురాళ్లను హైవే అథారిటీ సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. మార్కింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో భూ సేకరణపై రెవెన్యూ శాఖ దృష్టి పెట్టారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సేకరించనున్నారు. ఈ మేరకు వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయనున్నారు. వారం రోజుల్లో రైతుల సంఖ్య, పూర్తి విస్తీర్ణం వివరాలు తెలుస్తాయని తహసీల్దార్ వేణుగోపాలరావు తెలిపారు.

పోటాపోటీగా ఎద్దుల బల ప్రదర్శన

ప్రథమ స్థానం పొందిన గుంటూరు, బాపట్ల జిల్లాల గిత్తలు



4 పళ్ల విభాగంలో పోటీ పడుతున్న గుంటూరు గిత్తలు

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి వజ్రోత్సవ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు జరిగాయి. 4 పండ్ల సైజ్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మానాయుడు గిత్తలు, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన జె.పంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు గిత్తలు సమానంగా 3,900 అడుగుల దూరం లాగాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులు కలిపి రూ. 70 వేలను కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా శావల్యపురం మండలం మతుకుపల్లి గ్రామానికి చెందిన ముంద్రు జీవప్రసాద్, బాపట్ల జిల్లా మండల కేంద్రమైన సంతమాగులూరుకు చెందిన గిత్తలు 3,711 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ. 25 వేలు దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య గిత్తలు 3,705.10 అడుగుల దూరం లాగి 4వ బహుమతి రూ.20 వేలను దక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఎం. జయకృష్ణ చౌదరి, నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం నరసపల్లె గ్రామానికి చెందిన దోప్పరి లక్ష్మీదేవి గిత్తలు 3,663.5 అడుగుల దూరం లాగి 5 వ బహుమతి రూ.18 వేలను కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోండేపాడు గ్రామానికి చెందిన చాగంటి శ్రీనివాస్ చౌదరి గిత్తలు 3,600 అడుగుల దూరంలాగి 6వ బహుమతి రూ.16 వేలను దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా దువ్వూరు మండలం దాసరపల్లె గ్రామానికి చెందిన నరసింహ గిత్తలు 3,469 అడుగుల దూరం లాగి 7వ బహుమతి రూ. 14 వేలను గెలుచుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా మండల కేంద్రమైన పెదకొత్తపల్లి గ్రామానికి చెందిన శివ గిత్తలు 3,401.8 అడుగులు లాగి 8వ బహుమతి రూ. 12 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. నవీన్‌కుమార్, పల్నాడు జిల్లా ఈపూరు మండలం అంగలూరు గ్రామానికి చెందిన ఆర్. హరిబాబు గిత్తలు 3,369 అడుగులతో రూ. 9 వేలను కైవసం చేసుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 15 జతలు పాల్గొన్నాయి. మిగిలిన 6 జతలకు కూడ రూ. 3 వేల చొప్పున అందచేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, అల్లం ప్రతాప్ రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, బి. రామకృష్ణ, ఓ. ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, గాదె కస్పారెడ్డి, కె. జోసఫ్‌రెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న నాసర్‌జీ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యను వ్యాపారీకరణ చేసేందుకు సిద్ధపడుతున్నదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ విమర్శించారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమాఖ్య జిల్లా సమితి సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యారంగంలో అత్యున్నతమైన వైద్యవిద్యను పేద విద్యార్థుల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. దానిలో భాగంగానే రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 12 మెడికల్ కళాశాలలను తాము నిర్వహించలేమంటూ జాతీయ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయటం కన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఆయా కళాశాలలను 2025–26 విద్యాసంవత్సరంలో పూర్తి చేసి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు వైద్య విద్యార్థులకు శాపంగా మారిన 107, 108 జీఓలకు రద్దు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన నారా లోకేష్.. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సదరు జీఓల ఊసే తీసుకురావటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా రాష్ట్రంలో వందలాది మెడికల్ సీట్లు కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రైవేటు మెడికల్ కళాశాలలకు వత్తాసు పలుకుతున్నట్లుగా ఉందని ఇప్పటికే విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమైందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత విద్య ఆశలు అడియాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే ప్రారంభిస్తే దాదాపు 1,700 సీట్లు రాష్ట్ర విద్యార్థులకు దక్కే అవకాశం ఉంటుందని వివరించారు. కానీ, ప్రభుత్వం తన ఎన్నికల హామీని విస్మరించి అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాలలను మూసివేసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, గుడిపల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కవిరాజు త్రిపురనేని సాహిత్యం నిత్య నూతనం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవరాజు మహారాజు



దేవరాజు మహారాజు, రవిబాబుకు పురస్కారాలను ప్రదానం చేసిన సాహితీ సమితి ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహిత్యం నిత్య నూతనంగా వెలుగుతుందని ప్రముఖ సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. బుధవారం జేకేసీ కళాశాల ఆడిటోరియంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో ''సూత పురాణం'' శత వసంతాల వేడుక సందర్భంగా కవిరాజు త్రిపురనేని పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సాహితీ సమితి గౌరవాధ్యక్షుడు గద్దె మంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవరాజు మహారాజు, ప్రజా సాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబుకు కవిరాజు త్రిపురనేని పురస్కారాలను ప్రదానం చేశారు. ఈసందర్భంగా దేవరాజు మహారాజు మాట్లాడుతూ ఆధునిక కాలానికి కవిరాజు త్రిపురనేని సాహిత్యం ఎంతో అవసరమని చెప్పారు. ఆయన రచనలు నేటి తరానికి మార్గదర్శకమన్నారు. సమాజం హేతుబద్ధ పద్ధతిలోనే నడవాలని ఆయన కాంక్షించారని, మానవత్వమే ఆయన మతమని అన్నారు. కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ హేతుబద్ధ ఆలోచనలతో మనిషిగా మనిషిగా గౌరవించాలని త్రిపురనేని కాంక్షించారని అన్నారు. త్రిపురనేని రామస్వామి వందేళ్ల క్రితం రచించిన సూత పురాణాన్ని కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి వెలుగులోకి తీసుకురావడం, ఆయన పేరుతో పురస్కారాన్ని ప్రదానం చేయడం గొప్ప విషయమన్నారు. త్రిపురనేని ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం చిట్టినేని లక్ష్మీనారాయణ దర్శకత్వం వహించిన ''కవిరాజు విజయం'' సాహితీ పద్య రూపకం టెలీఫిలిం ప్రదర్శించారు. ఈసందర్భంగా ప్రజా గాయకుడు పీవీ రమణ బృందం కవిరాజు గీతాలాపాన చేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, సమితి అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య, పూర్వాధ్యక్షులు బైరపనేని నరేష్, జొన్నలగడ్డ రామారావు, ఉపాధ్యక్షులు రావెల సాంబశివరావు, కార్యదర్శి వల్లూరు తాండవకృష్ణ, సంయుక్త కార్యదర్శి పారా అశోక్, కోశాధికారి పాటిబండ్ల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 279 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: ప్రపంచవ్యాప్త సంస్థలకు టెక్నాలజీ మద్దతునిస్తున్న ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ సదర్‌లాండ్ గ్లోబల్ సర్వీసెస్ స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 279 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి రూ.2.40 లక్షల నుంచి రూ.2.70 లక్షల వార్షిక ప్యాకేజీతో కంపెనీ ఆఫర్ లెటర్లను అందించినట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కాలేజీలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదర్ ల్యాండ్ సంస్థ దశలవారీగా చేసిన ఇంటర్వ్యూల అనంతరం తాజాగా ఎంపిక జాబితాతో సహా ఆఫర్ లెటర్‌లను పంపినట్టు వివరించారు. ఒకే మల్టీనేషనల్ సంస్థకు ఇంత భారీసంఖ్యలో ఉద్యోగాలకు ఎంపికవటం గర్వకారణమన్నారు. కొత్త కోర్సులు, నాణ్యమైన విద్యాబోధనతో పాటు గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సులకు శిక్షణనిస్తూ అత్యధిక క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధిస్తున్నామని తెలియజేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గల కంపెనీల్లోనూ తమ విద్యార్థులు ఉద్యోగాలను సాధిస్తుండటం విశేషమన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ వారికి ఆఫర్ లెటర్లను అందజేశారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సులను ఉచితంగా అందిస్తూ, అందుకయే ఖర్చును కాలేజి యాజమాన్యం భరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం నుండి గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సుల శిక్షణ ఆరంభించినట్టు చెప్పారు.